
సాక్షి ఒడిశా

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,32,938లు, బంగారం 20 గ్రాము 750 మిల్లీగ్రాములు, వెండి 27 గ్రాములు 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు.

- 8లో



మినీ మారథాన్

మల్కన్‌గిరి జిల్లాస్థాయి మాల్యావంత్ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీ 11 గ్రామం నుంచి బుట్టిగూడ వరకు మినీ మారథాన్ పోటీలు సోమవారం నిర్వహించారు

- 8లో

న్యూస్‌రీల్

నిందితుడికి మూడేళ్ల జైలుశిక్ష

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి విచారణ జరిపిన రాయగడ ఎస్‌డీజేఎం(సబ్ డివిజనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్) కోర్టు జడ్జి వర్షా దాస్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తున్నట్లు తీర్పునిచ్చారు. ఘటనకు సంబంధించి ఎనిమిది మంది సాక్షులను విచారించిన మీదట సోమవారం ఈ తీర్పును వెల్లడించారు. దీనికి సంబంధించి వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది ఏప్రిల్ 19వ తేదీన జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి జేకేపూర్ గ్రామంలో ఉన్న ఈఎస్ఐ ఆస్పత్రిలో చోరీయత్నం జరిగింది. నిందితుడు గాంధీ దొళాయి అనే వ్యక్తి ఆస్పత్రి వెనుకనున్న కిటికీ విరిచి దొంగతనం చేసేందుకు లోపలికి వెళ్తుండగా సెక్యూరిటీ సిబ్బంది అతనిని పట్టుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ చందిలి పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అనంతరం శిక్ష విధించారు.

ఫ్యాక్టరీ నిర్మించవద్దని నిరసన



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి సిందిమాల పంచాయతీ సిమాగుడ గ్రామస్తులు సోమవారం కలెక్టరేట్ ముట్టడించారు. వివరాల్లోకి వెళ్తే.. సిమాగుడ గ్రామంలో సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించేందుకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. అయితే అక్కడ ఫ్యాక్టరీ నిర్మిస్తే కాలుష్యం వలన స్థానికుల ఆరోగ్యం దెబ్బతింటుందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనివలన 598 కుటుంబాలు వీధిన పడతారని, అందువలన కాలుష్య కారకమైన ఫ్యాక్టరీని నిర్మించవద్దని కోరుతున్నారు. దీనిలో భాగంగా ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు కలెక్టరేట్ ముట్టడించారు. అయితే కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ నుంచి సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మించవద్దని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న కార్మికులు

భువనేశ్వర్: స్థానిక ఎయిమ్స్ ఆవరణలో పారిశుద్ధ్య కార్మికులు సోమవారం ఆందోళనకు దిగారు. కాంట్రాక్టు సంస్థ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ చర్యలకు వ్యతిరేకంగా యాజమాన్యం తక్షణమే స్పందించాలని నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు విధులకు హాజరయ్యేది లేదని హెచ్చరించారు. వీరి ఆందోళనతో ఎయిమ్స్ లోపల, బయట పారిశుద్ధ్య కార్యకలాపాలకు సోమవారం అంతరాయం ఏర్పడింది.

లెక్క తేలింది..
గుట్టు వీడాలి..!

- ముగిసిన ఐటీ దాడులు
- కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు కార్యాలయాల్లో రూ.353 కోట్లు లభ్యం
- నోట్ల లెక్కింపులో మొరాయించిన మెషిన్లు
- 5 రోజులు కొనసాగిన ప్రక్రియ



ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్న నోట్ల కట్టలు



నగదు లెక్కిస్తున్న ఐటీ, ఎస్‌బీఐ ఉద్యోగులు



గుట్టలుగా పోగైన నోట్ల కట్టలు

భువనేశ్వర్: కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు కార్యాలయాలు, ఇళ్లలో ఆదాయపు పన్ను శాఖ చేపట్టిన దాడులు ఆదివారంతో ముగిశాయి. ఈ దాడుల్లో రికార్డు స్థాయిలో రూ.353 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మొత్తాలను లెక్కించడానికి దాదాపు 5 రోజులు పట్టింది. ఐటీ అధికారులు, బ్యాంకు ఉద్యోగులు అత్యంత కష్టపడి గంటల తరబడి నిరవధికంగా నోట్లను లెక్కించారు. అయితే ఇంత మొత్తం అతనికి ఎలా వచ్చిందనే విషయంపై గుట్టు తేలాల్సి ఉంది.

ఇదీ విషయం

5 రోజుల క్రితం పన్ను ఎగవేత ఆరోపణలపై ఒడిశా, మరో 3 రాష్ట్రాల ఆదాయపు పన్ను శాఖ సిబ్బంది ఎంపీ ధీరజ్ సాహు కార్యాలయాలు, ఇళ్లలో దాడులు ప్రారంభించారు. సోదాల్లో భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిలో భాగంగా ఆదివారం సాయంత్రం నాటికి బొలంగీర్, టిట్లాగడ్, సంబల్‌పూర్‌లోని ఎస్బీఐ మూడు శాఖల బ్యాంక్ అధికారులు 40కి పైగా నోట్ల లెక్కింపు యంత్రాలు, 80 మందికి పైగా ఉద్యోగులను నియమించి డబ్బును లెక్కించారు. టిట్లాగడ్, సంబల్‌పూర్ శాఖల్లో నగదు లెక్కింపు పూర్తైనా, బొలంగీర్‌లో సిబ్బంది మాత్రం లెక్కింపులో అలసటకు గురయ్యారు. ఒక దశలో నోట్ల లెక్కింపు యంత్రాలు మొరాయించాయి. మూడు శాఖల అధికారుల లెక్కింపులో దాదాపు రూ.353 కోట్ల లెక్క తేలింది. 5 రోజుల తర్వాత బొలంగీర్ శాఖలో ఆదివారం రాత్రి 8.30 గంటలకు లెక్కింపు ముగిసింది. ఈ ఒక్క శాఖలో 25 నోట్ల లెక్కింపు యంత్రాలు, 50 మంది బ్యాంకు సిబ్బంది లెక్కింపులో నిమగ్నమయ్యారు.

నిరంతరాయంగా లెక్కింపు

ఈ సందర్భంగా బొలంగీర్ ఎస్బీఐ ప్రాంతీయ మేనేజర్ భగత్ బెహరా మాట్లాడుతూ.. గత 3 రోజుల్లో ఉద్యోగులు లెక్కించిన నగదు మొత్తం ఒక సంవత్సరం నగదు గణన కంటే 100 రెట్లు ఎక్కువని పేర్కొన్నారు. అందులో 100, 200, 500 నోట్లు ఉన్నాయని, వాటిని 176 బ్యాగుల్లో ప్యాక్ చేశారని వెల్లడించారు. బొలంగీర్ పట్టణంలో సుద్‌పద ప్రాంతంలోని మద్యం కంపెనీ కార్యాలయం నుంచి ఈ బ్యాగులను బొలంగీర్ ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం శాఖకు తరలించారు. అంత డబ్బు లెక్కింపులో సిబ్బంది అలసిపోయారు. మరుగుదొడ్ల బ్రేక్‌లు మినహా సిబ్బంది పగలు, రాత్రి నిరవధికంగా పని చేశారన్నారు. 50 నుంచి 60 మంది బ్యాంకు ఉద్యోగులు నోట్ల లెక్కింపులో నిమగ్నమయ్యారు. 25కు పైగా నోట్ల లెక్కింపు యంత్రాలు ఈ ప్రక్రియలో వినియోగించారు. ఎక్కువ డబ్బు ఉండడంతో మెషిన్లు తరచూ మొరాయించగా సాంకేతిక నిపుణులు సవరించారు.

అంతుచిక్కని ఆదాయం

సుద్ధాపాడా నాటుసారా బట్టీ మేనేజర్ బంటీ సాహు, మరో ఉద్యోగిని ప్రశ్నించి వీరి సమక్షంలో డబ్బులు లెక్కించారు. స్థానిక డిస్టిలరీ నుంచి బంటీని, మరో కార్మికుడిని డబ్బు లెక్కింపు స్థలానికి తీసుకెళ్లారు. వారిద్దరినీ ఆదాయపు పన్ను శాఖ అధికారులు ప్రశ్నించారు. నాటుసారా బట్టీలో ఐటీ బృందం లోతుగా విచారణ చేపట్టింది. డబ్బుల లెక్కింపు అనంతరం రాష్ట్రంలో మద్యం వ్యాపారం చేస్తున్న కొందరిపై విచారణ జరిగే అవకాశం ఉందనే ప్రచారం సాగుతోంది. మరోవైపు ఈడీ కేసు నమోదుకు మార్గం తెరుచుకుంటుంది. ఈ డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందనే సందేహం సర్వత్రా కలకలం రేపుతోంది.

డైరీ, ల్యాప్‌టాప్ కీలకం

సోదాల్లో భాగంగా జార్ఖండ్, ఒడిశాలోని పలు ప్రాంతాల్లో దొరికిన ల్యాప్‌టాప్‌లు, డైరీలపై దర్యాప్తు బృందం విచారణ చేస్తోంది. దీని నుంచి భారీ నగదు వనరుల వివరాలు, లావాదేవీలకు సంబంధించిన ఆధారాలు లభిస్తాయని భావిస్తున్నారు. రాంచీలోని ఎంపీ ఇంట్లో చేపట్టిన సోదాల్లో రూ.8 కోట్లు, డైరీ, ల్యాప్‌టాప్, ప్రింటర్, మూడు బ్రీఫ్‌కేస్‌లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ 3 బ్రీఫ్‌కేసుల్లో దాదాపు 16 కిలోల బంగారం గుర్తించారు.

సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్

- ఎమ్మెల్యే విక్రమ్ పండా



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

బరంపురం: రానున్న సార్వత్రిక ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ పండా అన్నారు. స్థానిక జిల్లా బీజేడీ కార్యాలయంలో జిల్లా స్థాయి నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న గంజాం జిల్లాలో పార్టీ పటిష్టతకు అందరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించి ప్రజలకు మరింత చేరువవ్వాలని సూచించారు. బ్లాక్ స్థాయిలో పార్టీ సమావేశాలు నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించాలన్నారు. కార్యక్రమంలో అస్కా ఎంపీ ప్రమీళ బిసాయి, నగర మేయర్ సంఘ మిత్ర దొళాయి, మాజీ చైర్మన్ పి.భీముడు, బీజేడీ జిల్లా వైస్ చైర్మన్ బిజయ్ సామల్, భగవాన్ గొంతాయత్, జెడ్పీ చైర్మన్ సుభాష్ బెహరా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు జాక్‌పాట్



మత్స్యకారులకు చిక్కిన చేపలు

భువనేశ్వర్: జగత్‌సింగ్‌పూర్ జిల్లా పారాదీప్ సమీప సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు జాక్‌పాట్ తగిలింది. చేపల వేటకు పన్నిన వలలో విలువైన 17 తెలియా (తైల) చేపలు చిక్కాయి. వీటి బరువు 3 క్వింటాళ్లు పైబడి ఉండడంతో సుమారు రూ.25 లక్షలకు అమ్ముడుపోయాయి. వివరాల్లోకి వెళ్తే పారాదీప్‌కు చెందిన కొంతమంది మత్స్యకారులు చేపల వేటకు ఆదివారం రాత్రి వెళ్లారు. వీరికి అరుదైన తెలియా చేపలు చిక్కడంతో విక్రయానికి ప్రత్యేక వేలం కేంద్రానికి తరలించారు. ఈ వేలంలో రూ.25 లక్షలకు ఒక ప్రైవేట్ సంస్థ కొనుగోలు చేసింది. తెలియా చేపల పేగుల్లో పుష్కలంగా నూనెను కలిగి ఉంటుంది. దీనిని ఔషధాల తయారీలో ఉపయోగిస్తారు. తెలియా చేపల మొప్పలను కూడా విలువైనవిగా పరిగణిస్తారు. అందువలన వీటికి విదేశాల్లో సైతం భారీగా గిరాకీ ఉంటుంది.

అనారోగ్యంతో ఇద్దరు వలస కార్మికులు మృతి

- జ్వరంగా ఉన్నా పట్టించుకోని యాజమాన్యం
- ఇంటికెళ్లేలోపు విగత జీవులుగా మారిన వైనం



మహేశ్వర్ మాఝి



రంగాధర్ మాఝి (ఫైల్)

రాయగడ: ఉపాధి కోసం పొరుగు రాష్ట్రం వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు అనారోగ్యంతో మృతి చెందిన ఘటన జిల్లాలోని కాసీపూర్ సమితిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. టికిరి పంచాయతీ మొక్కాపాదొరొ గ్రామానికి చెందిన కుర్షి మాఝి కొడుకు మహేశ్వర్ మాఝి (20), అతని తమ్ముడు కొడుకు రంగాధర్ మాఝి (17) అనే ఇద్దరు యువకులు ఊరులో ఉపాధి లేకపోవడంతో పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు నాలుగు నెలలు క్రితం వెళ్లారు. అక్కడ విశాఖపట్నంలోని పాలంపేటలో ఒక రొయ్యల కంపెనీలో పనిచేయడానికి కుదిరారు. ఈ క్రమంలో ఇద్దరూ పనులు చేసుకుంటూ జీతాన్ని తమ కుటుంబాలకు పంపిస్తుండేవారు. అయితే వారం రోజుల క్రితం రంగాధర్ మాఝికి జ్వరం వచ్చి అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయాన్ని రొయ్యల కంపెనీ యజమానికి చెప్పినా కనీసం వైద్యం చేయించలేదు సరికదా, జ్వరం తగ్గిపోతుందిలే అని పనులు చేయమని వేధించారు. దీంతో ఎటువంటి చికిత్స అందక ఆరోగ్యం పూర్తిగా క్షీణించిపోయింది. ఈ క్రమంలోనే మహేశ్వర్ మాఝికి కూడా జ్వరం వచ్చి ఆరోగ్యం క్షీణించింది. దీంతో ఇద్దరు ఆదివారం నాడు కంపెనీలోని సూపర్‌వైజర్ నుంచి కొంత డబ్బులు తీసుకుని ఎవ్వరికీ చెప్పకుండా స్వగ్రామానికి బయల్దేరారు. విశాఖపట్నం నుంచి ఒక ట్రైన్‌లో రాయగడకు చేరుకున్నారు. అప్పటికే ఇద్దరికీ పూర్తిగా ఆరోగ్యం క్షీణించడంతో రాయగడ రైల్వేస్టేషన్‌లో అపస్మారక స్థితిలో పడిపోయారు. ఇది గమనించిన ఆర్పీఎఫ్ పోలీసులు వెంటనే వారిని ఆదివారం రాత్రి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందించిన కొద్ది సమయంలోనే రంగాధర్ మృతి చెందాడు. మహేశ్వర్ ఆరోగ్యం కూడా పూర్తిగా క్షీణిస్తుండడంతో వైద్యులు బరంపురం తరలించేందుకు సూచించారు. దీనిలో భాగంగా సోమవారం బరంపురం తరలిస్తుండగా మార్గమధ్యలో మహేశ్వర్ సైతం మృతి చెందాడు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు తెలియజేశారు. ఉపాధి కోసం వెళ్లిన పిల్లలు విగత జీవులుగా మారడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోధిస్తున్నారు. అనారోగ్యంతో ఉన్నా పట్టించుకోని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంస్కృతులకు ప్రతిబింబం..
చొయితీ ఉత్సవం

- అట్టహాసంగా ప్రారంభమైన ఉత్సవాలు
- 11 సమితుల్లో నిర్వహించనున్న ప్రభుత్వం
- 26 నుంచి జిల్లాస్థాయి ఉత్సవాలు



వేదికపై అధికారులు, ప్రజాప్రతినిధులు



ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌లో చొయితి-23 ఉత్సవాలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించి శైవక్షేత్రం కొండపైనున్న గంగా, జమున కొలనులోని జలాలను కలశాలతో తీసుకొచ్చి ఊరేగించారు. 108 కలశాలతో తీసుకొచ్చిన జలాన్ని సమితి కార్యాలయం వద్ద ప్రత్యేకంగా భద్రపరిచారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షురాలు అనసూయా మాఝి, జిల్లా సాంస్కృతి విభాగం అధికారి సస్మిత బౌరి తదితరులు పాల్గొన్నారు.

సమితుల వారీగా ఉత్సవాలు

సోమవారం కల్యాణ సింగుపూర్ సమితిలో ప్రారంభమైన ఈ ఉత్సవాలను జిల్లాలోని 11 సమితుల్లో నిర్వహిస్తారు. రోజుకు ఒక సమితిలో వైభవంగా ఉత్సవాలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేసింది. అనంతరం ఈనెల 26వ తేదీ నుంచి స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ఐదు రోజుల పాటు జిల్లాస్థాయి ఉత్సవాలు నిర్వహిస్తారు.

ప్రచార రథం ప్రారంభం

చొయితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం చొయితి ప్రచార రథాన్ని రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ మంత్రి జగన్నాథ సరక ప్రారంభించారు. ఈ రథం జిల్లాలోని 11 సమితుల్లో తిరిగి, జిల్లా స్థాయిలో జరగనున్న ఉత్సవాలు గురించి ప్రచారం చేస్తుంది. ఈ సందర్భంగా సమితి కార్యాలయం సమీపంలో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఆదివాసీల భాష, సంస్కృతికి అద్దం పట్టేవే చొయితి ఉత్సవాలని తెలిపారు. ప్రతీ ఏడాది చొయితి పేరిట నిర్వహించే ఉత్సవాలకు అనూహ్య స్పందన లభిస్తోందని తెలియజేశారు. ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ప్రదర్శన చేయడం జరుగుతుందన్నారు. ఒకవైపు సంస్కృతిని పరిరక్షించడంతో పాటు వారు సాధిస్తున్న పురోగతి వివరించే ప్రయత్నం చేస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, గుణుపూర్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగో పాల్గొన్నారు.



దొంగిరియా యువతుల నృత్యాలు



నది జలాలు తీసుకొస్తున్న మహిళలు



సమావేశంలో పాల్గొన్న ప్రజలు

ఆకట్టుకున్న నృత్యాలు



నృత్యాలు చేస్తున్న అధికారులు

ఊరేగింపులో భాగంగా ఆదివాసీ, హరిజన తెగలకు చెందినవారు సాంప్రదాయ వాయిద్యాలు, నృత్యాలతో అలరించారు. ఈ సందడిలో స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు, అధికారులు సైతం నృత్యాలు చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అదేవిధంగా ప్రప్రథమంగా ట్రాన్స్ జెండర్స్ కూడా నృత్యాల్లో పాల్గొని ఆకట్టుకున్నారు.

స్టాల్స్ ప్రదర్శన



స్టాల్‌లో వెదురుతో రూపొందించిన వస్తువులు

చొయితి ఉత్సవాల్లో భాగంగా సమితి పరిధిలోని స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళలు, మిషన్ శక్తి కార్యకర్తలు స్టాల్స్‌లో ప్రదర్శించిన వివిధ వస్తువులు ఆకట్టుకున్నాయి. కల్యాణ సింగుపూర్ మిషన్ శక్తి మహిళలు ఏర్పాటు చేసిన వెదురుతో రూపొందించిన వస్తువులు చూపరులను అబ్బురపరచాయి.

భీమారావుకు జీవన సాఫల్య పురస్కారం



పురస్కారం అందుకుంటున్న భీమారావు

భువనేశ్వర్: డాక్టర్ రఘుపాత్రుని భీమారావుకు ఈ ఏడాది ఐఐఎంఈ జీవన సాఫల్య పురస్కారం లభించింది. ఖనిజ పరిశ్రమల రంగంలో 45 ఏళ్ల సుదీర్ఘ అనుభవం కలిగిన ఆయనకు ఈ సత్కారం అందజేశారు. స్థానిక భారతీయ ఖనిజ ఇంజినీర్ల సంస్థ అధ్యక్షుడు డాక్టరు బి.కె.శత్పతి ఆయనను సన్మానించి జీవన సాఫల్య పురస్కారం అందజేశారు.

వేడుకగా దేవ దీపావళి

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని ఆలయంలో దేవ దీపావళిని సోమవారం వేడుకగా నిర్వహించారు. దీనిలో భాగంగా బొడొ దండొ శ్రీమందిరం సింహద్వారం నుంచి గుండిచా గుడి వరకు లక్ష దీపాలతో కాంతులు వెదజల్లాయి. దీపాంజలి శీర్షికతో ఒడిశా ఇంటర్నేషనల్ సంస్థ ఈ కార్యక్రమం నిర్వహించింది. సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు దీపారాధన జరిపారు. అంతకు ముందు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మెడికల్ ఛక్ హతి ఒఖొడా మఠం ప్రాంగణంలో విశ్వశాంతి అగ్నిహోత్ర యజ్ఞం నిర్వహించారు. శ్రీగుండిచా ఆలయం ఆవరణలో రాత్రి పూరీకి చెందిన ప్రముఖ గాయకులు భజన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని ధర్నా

టెక్కలి: మెళియాపుట్టి మండలం పద్ద గ్రామం సమీపంలో సర్వే నంబరు 1 లో ఇంజాద్రికొండపై అక్రమంగా మంజూరు చేసిన గ్రానైట్ అనుమతులు రద్దు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవ రావు డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలి మైన్స్ ఏడీ కార్యాలయం ఎదుట గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా, పర్యావరణ అనుమతులు లేకుండా మంజూరు చేసిన అనుమతులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇదే కొండపై గిరిజనులు పోడు వ్యవసాయం చేస్తున్నారని, తక్షణమే మైనింగ్ అధికారులు చొరవ చూపి మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని కోరుతూ మైనింగ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.భాస్కరరావు, గొరేష్, నూకయ్య, శ్రీను, సోమేష్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తర్లి ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడి ప్రతిభ



గోల్డ్ మెడల్ అందుకుంటున్న రవికుమార్

సారవకోట: మండలంలోని తర్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జన్ని రవికుమార్ మాస్టర్ అథ్లెటిక్స్‌లో తన ప్రతిభ చూపించారు. ఈ నెల 8 నుంచి 10 వరకు తిరుపతి శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ ఆవరణలో జరిగిన 42వ మాస్టర్ అథ్లెటిక్స్‌లో నాలుగు పతకాలు సాధించారు. ఈ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఆయన జావెలిన్ త్రో, పోల్‌వాల్ట్, 400 రిలే రన్‌లో బంగారు పతకం సాధించగా.. డిస్క్ త్రోలో సిల్వర్ పతకం సాధించారు. నాలుగు పతకాలు సాధించిన రవికుమార్‌ను పాఠశాల సిబ్బంది, మండలంలోని గొర్రిబంద పంచాయతీ జగన్నాథపురం గ్రామస్తులు అభినందించారు. వచ్చే ఏడాది జనవరిలో పూణేలో జరగనున్న నేషనల్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

'పోలీసులు నైపుణ్యాలు పెంచుకోవాలి'



పోలీసుల పరేడ్ పరిశీలిస్తున్న ఏఎస్పీ తిప్పేస్వామి

ఎచ్చెర్ల క్యాంపస్: పోలీసులు నైపుణ్యాలు మెరుగు పర్చుకోవాలని అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి అన్నారు. ఎచ్చెర్ల ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాక్ డ్రిల్, మాబ్ ఆపరేషన్, వీఐపీ భద్రత, 144 సెక్షన్ అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సభలు, సమావేశాలు, విపత్తులు, రాస్తారోకాలు వంటి సమయాల్లో వ్యవహార శైలిపై డెమోలు నిర్వహించారు. పోలీస్ శాఖలో శాంతి భద్రతలకు సంబంధించిన ప్రతి అంశంలో అవగాహన, నైపుణ్యం సిబ్బందిలో ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

'ఆస్పత్రి ప్రసవాలు పెంచండి'



జలుమూరులో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మీనాక్షి

జలుమూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. ఆమె సోమవారం జలుమూరు పీహెచ్‌సీని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన పథకంలో జరిగిన ప్రసవాలు ఆన్‌లైన్ చేయాలన్నారు. వాతావరణంలో మార్పుల ఫలితంగా చిన్నారులు, అప్పుడే పుట్టిన పిల్లలకు శ్వాసకోస వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ నుంచి ఎంత మందిని ఇతర ఆస్పత్రులకు తరలించారో కూడా ఆన్‌లైన్ చేయాలన్నారు. ఆమెతోపాటు మెడకల్ అధికారులు టి.శ్రీకాంత్, చల్ల వంశీకృష్ణ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడిగా కొమ్ము

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడిగా కొమ్ము రమణమూర్తిని నియమించారు. విశాఖపట్నంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు నియామక పత్రం సోమవారం అందించారు.

క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు

● ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం:

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. స్థానిక విక్రమదేవ్ విశ్వ విద్యాలయంలో ఆదివారం రాత్రి నిర్వహించిన యువ ఒడిశా – నవీన ఒడిశా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కష్టపడితే తప్పనిసరిగా ఫలితం ఉంటుందన్నారు. ఈ కళాశాలలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఉన్నత పదవుల్లో ఉన్నారని వివరించారు. అలాగే కొంతమంది వర్సిటీలోనే గుణాత్మక విద్య అందిస్తున్నారని తెలియజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. వర్సిటీ ఓఎస్డీ దేవీ ప్రసాద్ మిశ్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ గోపాల హల్దార్, పీజీ కౌన్సిలర్ అధ్యక్షుడు డాక్టర్ కీచక చంద్రనాయిక్, నోడల్ అధికారి డా.ప్రశాంత కుమార్ పాత్రో, అధ్యాపకులు డా.లక్ష్మణ పాత్రో, ప్రతాప్ కుమార్ సాహు, ప్రహ్లాద్ పండ, డా.మనోరంజన్ ప్రదాన్, డా.బీబీ నందో, డా.బిజయకుమార్ సెఠి, డా.అరుణరాజ్, డా.సాగరిక మిశ్ర, సచిన్ కుమార్ నాయక్, మహేశ్వర దురియ, భగవత ప్రసాద్ సింగ్, జ్ఞానరంజన్ మహంతి, ఋషభ పాత్రో, సంతోషిణి ముండ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ప్రజలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పర్లాకిమిడి చేరుకున్న ఉత్సవ జ్యోతి



ఉత్సవ జ్యోతిని తీసుకెళ్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా సంస్కృతి, కళలు, ఆదివాసీల అభివృద్ధిని ప్రతిబింబించే గజపతి ఉత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 23 వరకు జరగనున్నాయి. దీనిలో భాగంగా జిల్లాలోని కోయిపూర్ పంచాయతీలో ఉన్న మహేంద్రగిరి కుంతీ మందిరం నుంచి ఉదయం బయల్దేరిన ఉత్సవ జ్యోతి రాయఘడ బ్లాక్ మీదుగా ఉప్పలాడ, సెంచూరియన్ వర్సిటీ నుంచి పర్లాకిమిడి చేరుకుంది. కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ బిజూ కల్యాణ మండపం వద్ద మసాల్‌ను చేతపట్టుకున్నారు. యాత్రలో పర్లాకిమిడి పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో తీన్‌మార్ బ్యాండ్



హైస్కూల్ జంక్షన్ వద్ద జ్యోతిని ఆహ్వానిస్తున్న పురపాలక అధ్యక్షురాలు నిర్మలా శెఠి

సమస్యలపై విశ్రాంత ఉద్యోగుల చర్చ



విశ్రాంత ఉద్యోగుల సమావేశం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాత బస్టాండ్ వద్ద గల ఎన్‌జీఓ హోమ్‌లో విశ్రాంత ఉద్యోగుల సమావేశం సోమవారం జరిగింది. కార్యక్రమంలో 60 మంది విశ్రాంత ఉద్యోగులు హాజరై వారి సమస్యలపై చర్చించారు. అలాగే జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది సౌజన్యంతో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సహాధ్యక్షుడు ఎంఎస్ఆర్.ఎస్ ప్రకాశరావు, జిల్లా సంఘం జనరల్ సెక్రటరీ పి.నరసింహమూర్తి, సిటీ బ్రాంచ్ అధ్యక్షుడు కె.సోమసుందరరావు, పిఎస్ ప్రసాదరావు, కోశాధికారి వేంకటేశ్వరరావు, బి.ఆదినారాయణ రావు, డీవీఎస్ ఆచారి గణపతి ఆచారి, ఆదినారాయణ, సవరయ్య, ఝాన్సీరాణి, డిపి నరసమ్మ పాల్గొన్నారు.

ఏడెకరాల వరి పొలం దగ్ధం



కాలిపోయిన వరి పొలాన్ని చూపిస్తున్న రైతులు

పాతపట్నం: మండలంలోని ఏఎస్ కవిటి గ్రామానికి చెందిన ఆరుగురు రైతులకు చెందిన ఏడెకరాల వరిపొలం అగ్నికి ఆహుతయ్యింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి సోర్లండ రెవెన్యూ పరిధిలోని ఆరుగురు రైతులు ఎర్ర రామారావు, గద్ది జగ్గారావు, సాద భాగ్యరాజు, సాద నారాయణ, మిరియాబిల్లి శ్రీధర్, టంకాల సరోజినిలకు చెందిన సుమారు ఏడెకరాల వరిపంట అగ్ని ప్రమాదంలో కాలిపోయింది. పొలంలో మంటలు రావడంతో స్థానికులు కొత్తూరు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. రెవెన్యూ అధికారులు పంట నష్టం పరిశీలించారు.

కిడ్నీ ఆస్పత్రి సందర్శన

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పద్మనాభపురం వద్ద గల కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆస్పత్రిని ఉద్దానం ప్రాంతానికి చెందిన యూత్ ఫోర్స్ సభ్యులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక ప్రత్యేకమైన ఆస్పత్రికి ఉండాల్సిన ఆధునాతనమైన వసతులతో ఈ ఆస్పత్రిని నిర్మించడం సంతోషకరమన్నారు. ఆస్పత్రి నిర్మాణంలో మంత్రి సీదిరి అప్పలరాజు కృషి అభినందనీయమన్నారు. ఈ ఆస్పత్రి భవిష్యత్‌లో మంచి ఫలితాలు ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రజా వాగ్గేయ కారుడు కుత్తుం వినోద్, మాకన్నపల్లి సర్పంచి సైని దేశయ్య, కీలు నారాయణ, కారాట శ్యామ్, బత్తిన భాస్కర్, ఆనంద్, వసంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కిడ్నీ ఆస్పత్రిని సందర్శించిన ఉద్దానం యూత్ ఫోర్సు ప్రతినిధులు

జాతీయ స్థాయి పోటీలకు

ఆదర్శ పాఠశాల విద్యార్థులు

సోంపేట: సోంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు తిరుపతిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి దుద్ది కౌశిక్, 9వ తరగతి విద్యార్థి ఆనింగి తుల సీరాం రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయుడు జైమారావు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లి దండ్రులు అభినందించారు. అలాగే బారువ గ్రామానికి చెందిన విద్యార్థులు పల్నాడు జిల్లాలోని నరసరావు పేటలో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు బి.మారుతీ రావు తెలిపారు. అండర్–17 విభాగంలో ఎస్.గాయత్రి, అండర్–19 విభాగంలో ఎం.అఖిల్, జి.కామేశ్వరరావు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.





జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

బీలలో ఖరీఫ్ కోతలు



పుటియాదళలో వరికోతల్లో మహిళాకూలీలు

కవిటి: మండలంలోని బీల ప్రాంతంలో ఖరీఫ్ వరికోతలు మొదలయ్యాయి. ఇక్కడ పొలాలన్నీ వర్షాధారమే. అయితే కవిటి మండలం బీల ప్రాంతంలో వ్యవసాయ ఉచిత విద్యుత్ బోర్ల కింద దాదాపు 2000 ఎకరాలు సాగవుతోంది. తాజాగా నెలవంక, కపాసుకుద్ధి, పుటియాదళ, కవిటి, జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, బి.గొనపుట్టుగ, వరక, కుసుంపురం, బల్లిపుట్టుగ, మాణిక్యపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో తాజాగా వరికోతలు ఊపందుకుంటున్నాయి.



తూర్పారబట్టిన ధాన్యాన్ని ట్రాక్టర్లలో తరలిస్తున్న రైతు కూలీలు

• మినీ మారథాన్











జిల్లాస్థాయి మాల్యావంత్ ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎంవీ 11 గ్రామం నుంచి బుట్టిగూడ వరకు మినీ మారథాన్ పోటీలు సోమవారం నిర్వహించారు. పోటీల్లో పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్లుతో పాటు మొత్తం 400 మంది పాల్గొన్నారు. మారథాన్‌ను మల్కన్‌గిరి అడిషనల్ కలెక్టర్ వెద్బర్ ప్రదాన్ పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నడకతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందన్నారు. పోటీలో గెలిచిన వారికి ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా పౌర సంబంధాలు మరియు సమాచార అధికారి ప్రమిళ మాఝి, మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్‌కీండో, జిల్లా క్రీడా అధికారి మాధవ్ పంగి తదితరులు పాల్గొన్నారు. - మల్కన్‌గిరి

వీధి నాటకాలతో ప్రజల్లో చైతన్యం



జయపురం: నాటకం ప్రదర్శిస్తున్న జానీ దుడుంగు నాటక గ్రూపు

జయపురం: జిల్లా సంక్షేమ విభాగం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు రావడానికి ఈనెల 8వ తేదీ నుంచి నిర్వహించిన వీధి నాటకాలు ఆదివారంతో ముగిశాయి. కొరాపుట్ జిల్లా దసమంతపూర్ సమితి జానీ డుడుంగు నాటక గ్రూపు వారు కుమార జానీ నేతృత్వంలో జయపురం సమితిలోని అన్ని పంచాయతీల్లో నాటకాలను ప్రదర్శించారు. బాల్య వివాహాల నిర్మూలన, ఆడ పిల్లల సంరక్షణ, ఆరోగ్యం, పౌష్టికాహారం అందించడం తదితర అంశాలపై నాటకాలు ప్రదర్శించారు.

పర్లాకిమిడి: స్థానిక శ్రీకృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల విద్యార్థులు గుసాని సమితి కెరండీ గ్రామంలో సమగ్ర వికాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీనిలో భాగంగా సాక్షరతా అభియాన్, బాల్య వివాహాల రద్దుపై వీధి నాటకం ప్రదర్శించి గ్రామంలో చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎస్‌కేసీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్, నోడల్ అధికారి పుల్లక్ చంద్ర ఫిలిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

తెలుగు వారికి చివరి కార్తీక సోమవారం కావడంతో శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయాల వద్ద శివనామ స్మరణ మార్మోగింది. శివునికి క్షీర, జల, రుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే పలుచోట్ల కార్తీక వన భోజనాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: ప్రత్యేక పూజలు అందుకుంటున్న స్వయంబు లింగేశ్వరుడు



జయపురం: కపిలేశ్వర మందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



బరంపురం: నీలకంఠేశ్వర్ ఆలయంలో అభిషేకాలు చేస్తున్న అర్చకులు



బరంపురం: నీలకంఠేశ్వర్ ఆలయలో బారులుతీరిన భక్తులు



జయపురం: ఏనుగుల శాలలో కార్తీక వన భోజనాలు జరుపుకుంటున్న ప్రజలు

క్లుప్తంగా

మూడుకు చేరిన మృతుల సంఖ్య


మృతిచెందిన చిన్నారి లాస్య

లక్కవరపుకోట: మండల కేంద్రం లక్కవరపుకోటలోని గవర వీధిలో గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య మూడుకు చేరింది. గత నెల 19వ తేదీన గ్యాస్ లీకై ఇల్లు పేలిపోయిన ఘటనలో ఇద్దరు మహిళలు, ముగ్గురు చిన్నారులు తీవ్రంగా కాలిపోయిన విషయం విదితమే.ఈ ప్రమాదంలో తీవ్రంగా కాలిపోయిన కె.లాస్య(8) విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఏఎస్సై టి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన తామరాపల్లి వెంకటలక్ష్మి (50) గత నెల 29న, మరో మహిళ కె.శ్రావణి (30) ఈ నెల 7న మృతిచెందారు. వీరంతా ఒకే కుంటుంబానికి చెందిన వారు.ఈ ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు చిన్నారులు ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, వారి పరిస్థితికూడా విషమంగా ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

లారీ ఢీకొని మహిళ మృతి


పోలమ్మ మృతదేహం

పార్వతీపురంటౌన్: మండలంలోని అడ్డాపుశీల గ్రామ సమీపంలో సోమవారం లారీ ఢీకొని ఓ మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంపై రూరల్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జియ్యమ్మవలస మండలం సింగనాపురం గ్రామానికి చెందిన పోలమ్మ(39)భర్తతో కలిసి పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల కాశీ విశ్వేశ్వరుని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ అడ్డాపుశీల గ్రామ సమీపంలో ఢీకొంది. దీంతో గాయపడిన ఆమెను పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ జయరావు తెలిపారు.

చెట్ల నరికివేతపై అటవీ శాఖాధికారుల పరిశీలన


ఎస్.కోట: నరికిన చెట్లు, దుంగలకు కొలతలు వేస్తున్న అటవీశాఖాధికారులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుమతి లేకుండా నరికివేతకు గురైన చెట్లను అటవీ శాఖాధికారులు సోమవారం పరిశీలించారు. కళాశాల ప్రాంగణంలో అనుమతుల్లేకుండా టేకు,తురాయి, కాగు చెట్లు తొలగించడంపై వచ్చిన ఫిర్యాదుమేరకు అటవీశాఖాధికారి రవి కుమార్ నరికివేతకు గురైన చెట్లు, దుంగలను పరిశీలించి కొలతలు తీసుకున్నారు. అనుమతుల్లేకుండా నరికివేతకు గురైన చెట్లు కొలతలను బట్టి ఉన్నతాధికారులు జరిమానా విధించనున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు వద్ద చెట్ల నరికివేతపై ప్రస్తావించగా 22, 23 తేదీల్లో న్యాక్ టీమ్ సందర్శన ఉన్నందున నేలను సమాంతరం చేసేందుకు చెట్లు తొలగించామని ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలియదని చెప్పారు.

మీరంతా ప్రజా సేవకులు


మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ మురళి

సీతంపేట: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యాన్ని సిద్ధింప జేస్తూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాలయ వ్యవస్థలో మీరంతా సేవకులు.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి.. గిరిజనులకు మేలు చేయాలి.. సేవాభావంతో ముందుకు సాగాలని ఏపీ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీరాజ్ (ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్) డైరెక్టర్ జె.మురళి సూచించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు సచివాలయ సేవలు మరింత మెరుగ్గా ప్రజలకు అందజేసేందుకు వీలుగా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. సీతంపేట వైటీసీలో గ్రామ సచివాలయ సిబ్బందికి ఇస్తున్న శిక్షణ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. శిక్షణ తీరు, ఎంతవరకు ఉపయోగపతుందన్న విషయాన్ని సచివాలయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరమైన సమస్యలను అధిగమించడంపై విజయవాడలో 20 మందికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్నారు. వారితో మిగిలిని సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తున్నామని చెప్పారు. ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలన్నదే సీఎం ఆశయమన్నారు. టీమ్ వర్క్ చేస్తే ఒత్తిడి పోతుందన్నారు. ఒత్తిడి తగ్గాలంటే ధ్యానం చేయాలన్నారు. ఒక్క నిమషంలో మూడు పదాలు రాయడం ప్రతి సచివాలయంలో కండక్ట్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే, రోజుకో ఆంగ్లపదం నేర్చుకోవాలన్నారు. 3వేలు పదాలు నేర్చుకుంటే ఇంగ్లిష్ మాట్లాడవచ్చని చెప్పారు.

సిరి వరించాలంటే..

- జాగ్రత్తలు పాటిస్తేనే సాధ్యం
- పండని పంట కోస్తే నష్టమే
- అతిగా ఎండకాసినా ఆదాయం శూన్యమే
- జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వరికోతలు
- పలుచోట్ల నూర్పులు
- సేకరించిన ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు
- గిట్టుబాటు రావాలంటే జాగ్రత్తలు ఉండాలి


బొడ్డవలస వద్ద ధాన్యం నూర్పును పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాజాం: జిల్లాలో ఖరీఫ్ వరికోతలు జోరుగు సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో నూర్పులు చేపడుతున్నారు. తుఫాన్ సూచనలు ఉండడంతో ముందుగా ధాన్యాన్ని ఇంటికి తరలించి భద్రపర్చాలని కొంత మంది, కొనుగోలు కేంద్రాలకు తరలించి సొమ్ముచేసుకోవాలని మరికొంతమంది అన్నదాతలు ఆశపడుతున్నారు. ఈ పరిస్థితుల్లో విధిగా యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచిదని, కష్టానికి తగిన ఆదాయం రావాలంటే జాగ్రత్తలు తీసుకోక తప్పదని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వరి సాగుతో పాటు పంటకోత, నూర్పిడి, ఒబ్బిడిలోనూ మెలకువలు పాటించినప్పుడే దిగుబడులు పెరుగుతాయని వ్యవసాయ శాఖ రాజాం ఏడీఏ కె.చంద్రరావు వెల్లడించారు. ప్రధానంగా రైతులకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల వద్ద సలహాలు తీసుకోవాలని సూచిస్తున్నారు.


రేగిడిలో వరికుప్పలు పెట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్న వీఏఏ

ఇలా చేయాలి..

వరి కుంకుల్లో 80 నుంచి 90 శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడే పంటను కోయాలి. ఈ దశలో ధాన్యం గింజల్లో 18 నుంచి 24 వరకూ తేమ శాతం ఉంటుంది. పూర్తిగా ఎండిపోయే వరకూ వరి పంట కోయకుండా వదిలేస్తే రెక్క రాలడం వల్ల గింజ దిగుబడి తగ్గిపోతుంది. ధాన్యం గింజలపై పగుళ్లు వస్తాయి. పగిలిన ధాన్యాన్ని మిల్లులో ఆడించేటప్పుడు బియ్యం శాతం తగ్గి నూకల శాతం ఎక్కువ ఉంటుంది. వరి పంటను కోసిన తరువాత తేమ శాతాన్ని తగ్గించడానికి వరి పనలను 4 నుంచి 5 రోజులు పంటభూమిలోనే ఆరనివ్వాలి. కోసిన వరి పనలను కిందికి, మీదకు తిరగబెడితే సమానంగా ఎండుతుంది. వరి పనలు కోసిన తరువాత వర్షం కురిస్తే ఐదు శాతం ఉప్పును పనలపై జల్లితే ధాన్యం రంగు మారదు. వరి పంట పూతకొచ్చిన తరువాత 30 రోజుల్లో కోత దశకు చేరుకుంటుంది. పంట పూర్తిగా పండకుండా కోత కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉంటాయి. వరి కంకిలోని చివర గింజలు పూర్తిగా తోడుకాకుండా ధాన్యం సన్నగా ఉండి పొట్ట తెలుపు రంగులో ఉంటాయి. దీని వల్ల ధాన్యం దిగుబడి తగ్గి నూక, తవుడు శాతం ఎక్కువగా ఉంటుంది. పండిన వరి పంటను యంత్రం ద్వారా నూర్చడం వల్ల మట్టిబెడ్డలు చెత్త, దుమ్ము వంటివి ధాన్యంలో ఉండవు. నూర్పు చేసిన ధాన్యాన్ని ఎక్కువగా ఎండ ఉన్నప్పుడు ఆరబెట్టకూడదు.తేమ తగ్గిపోయి మిల్లు ఆడించేటప్పుడు నూకలు ఎక్కువగా వస్తాయి.

జాగ్రత్తలు తప్పనిసరి..



ఆరుగాలం కష్టపడి వరిని పండించే రైతులు పంటకోత, కుప్పలు పెట్టడం, నూర్పు సమయంలో జాగ్రత్తలు పాటించాలి. పండిన వరి పంటను సకాలంలో కోయాలి. నూర్పు చేసే ధాన్యంలో 14 శాతం కన్నా తేమ తక్కువ ఉండేలా చూసుకోవాలి. ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ ఉంచరాదు. దగ్గర్లోని రైతు భరోసా కేంద్రాల్లో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ల సలహాలు పాటించాలి.
– కె.చంద్రరావు, వ్యవసాయశాఖ ఎ.డి., రాజాం

ఈ మెలకువలు పాటించాలి

- ఒబ్బిడిగా నిల్వ చేయాలి.
- నూర్చిన ధాన్యాన్ని 14 శాతం కన్నా తక్కువగా తేమ ఉండేలా చూసుకోవాలి.
- ధాన్యంలో తేమశాతం ఎక్కువగా ఉంటే ధాన్యం బూజు పట్టడం, రంగు మారడంతో పాటు కీటకాలు ఆశిస్తాయి.
- ఎక్కువ నిల్వ ఉంచాల్సి వస్తే కీటకాలు ఆశించకుండా పొగబెట్టాలి.
- ధాన్యాన్ని పొడి సంచుల్లో వేయడంతో పాటు గోడలు, నేలపై తేమ పీల్చకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి.
- ధాన్యం బస్తాలను 1 నుంచి రెండు అడుగుల ఎత్తులో వేస్తే భూమిపై ఉన్న తేమను లాక్కోవు.
- ఎలుకలు ఆశించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యాన్ని ఎక్కువ కాలం నిల్వ చేస్తే రంగు మారుతాయి.
- రైతులు సకాలంలో అమ్మడం లేదా మరపట్టించడం చేయాలి.
- రైతు భరోసా కేంద్రాలను సంప్రదించి విక్రయాలకు సంబంధించి ట్రక్ షీట్ పొంది, సంబంధిత ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలి.

సస్యరక్షణతో తెగులు నివారణ

- ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ
- సాక్షి కథనానికి స్పందన


పొట్టిచిక్కుడు పంటను పరిశీలించి తెగులు నివారణపై రైతులకు సూచనలు చేస్తున్న ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ

రామభద్రపురం: సస్యరక్షణ చర్యలతో కూరగాయల పంటల్లో తెగులు, చీడపురుగులను రైతులు నివారించుకోవచ్చునని రామభద్రపురం మండల ఉద్యానశాఖాధికారి పి.మోహనకృష్ణ సూచించారు. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తెగులు, పురుగు సోకి పంటలు పూర్తిగా పాడయ్యాయి.దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు పెట్టుబడులు కూడా రాక తీవ్ర నష్టాల పాలయ్యామని రైతులు వాపోతున్నారు. దీంతో 'ఇదేం చీడ బాబోయ్'..! శీర్షికతో ఈ నెల 11వ తేదీన సాక్షి కథనం ప్రచురిచింది.ఈ కథనానికి స్పందించిన ఉద్యానశాఖాధికారి పి మోహనరావు, వీహెచ్ఏ హైమావతిలు సోమవారం మండలంలోని కూరగాయల పంటలను పరిశీలించారు. తుఫాన్ ప్రభావం వల్ల కూరగాయల పంటల్లో తెగులు, పురుగు బెడద, వైరస్ ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు.పొట్టి చిక్కుడులో మొజాయిక్ తెగులు, ఆకుల మీద లేద పసుపు మచ్చలు, తుప్పు తెగులు, బ్యాక్టీరియా తెగులును గుర్తించారు. అలాగే ఉల్లి తామర పురుగు, వంకాయలో కొమ్ము, కాయ తొలుచుపురుగు సోకినట్లు గుర్తించారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఇంకాఏమైనా సందేహాలుంటే గ్రామ ఉద్యాన సహాయకులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్ఏ ఎల్.హైమావతి, ఎస్ జ్యోతి, పి.కొండలరావులు పాల్గొన్నారు.

ఆర్‌టీసీ డ్రైవర్ ప్రతిభ



సంతకవిటి: పతకాలతో ఆర్‌టీసీ డ్రైవర్ ప్రసాద్

సంతకవిటి: తిరుపతిలో ఈ నెల 8 నుంచి 10 వరకు నిర్వహించిన 42వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో సంతకవిటి మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ జరజాన ప్రసాద్ తన సత్తా చాటి పరుగు పందెం 4 x100 రిలే, హైజంప్‌లో గోల్డ్ మెడల్స్, లాంగ్‌జంప్‌లో రజతం, 100 మీటర్ల పరుగుపందెలో కాంస్య పతకాలను సాధించా రు. ఆయన ప్రస్తుతం మన్యం జిల్లాలోని పాలకొండ ఆర్‌టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సహచర సిబ్బంది ఆయనను అభినందించారు.

నాటకానికి ప్రామాణికం 'కన్యాశుల్కం'


మహాకవి గురజాడ స్వగృహంలో ఎల్.బి.శ్రీరామ్‌ను సత్కరిస్తున్న గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి రచించిన కన్యాశుల్కమనేది నాటకానికి ప్రామాణికమని సినీ నటుడు, రచయిత ఎల్.బి.శ్రీరామ్ పేర్కొన్నారు. విజయనగరంలోని గురజాడ స్వగృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేడపైన ఉన్న మహాకవి వాడిన కళ్లద్దాలు, పుస్తకాలు చూసి తన్మయత్వం చెందారు. విజిటర్ రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్యనటుడిగా హాస్యరసాన్ని పండిస్తున్నామంటే కన్యాశుల్కం నాటకాన్ని బేస్‌గా తీసుకుని చేస్తున్నామని గుర్తుచేశారు. గతంలో ఓసారి రాత్రి సమయంలో వచ్చినప్పుడు గురజాడ ఇళ్లు మూసివేసి ఉందని, అప్పుడు చూడలేకపోయానని, విశాఖలో గొల్లపూడి మారుతీరావు పేరుతో తనకు మంగళవారం అవార్డు ఇస్తున్నారని, అందుకు ముందుగానే విజయనగరం చేరుకుని మహాకవి ఇంటిని దర్శించుకోగలిగానన్నారు. ఈ సందర్భంగా గురజాడ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో ఆయనను దుశ్శాలువతో సత్కరించి, కన్యాశుల్కం పుస్తకాన్ని అందజేశారు. గురజాడ ముని మనవడు గురజాడ వెంకటేశ్వరప్రసాద్, ఇందిర దంపతులు, సమాఖ్య ప్రధాన కార్యదర్శి ప్రకాష్, సభ్యులు భోగరాజు సూర్యలక్ష్మి, చక్రవర్తి పాల్గొన్నారు.

గోస్తనీలో పడి విద్యార్థి మృతి

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి విశాఖ జిల్లా పద్మనాభం మండలంలోని గోస్తనీ నదిలో పడిపోయి మృతి చెందాడు. ఈ ప్రమాదంపై కుటుంబసభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొంపల్లి గ్రామానికి చెందిన పొన్నగంటి అప్పారావు ఏడేళ్ల క్రితం జీవనోపాధి కోసం కుటుంబసభ్యులతో కలిసి విశాఖపట్నం వెళ్లిపోయి పెయింటింగ్‌లు వేసుకుంటూ కుటుంబపోషణ సాగిస్తున్నాడు. ఆయన చిన్న కుమారుడు హరి(16) ఇంటర్మీడియట్ అక్కడే చదువుతున్నాడు. ఆదివారం కొంతమంది స్నేహితులతో కలిసి పిక్నిక్ కోసం పద్మనాభం మండలంలోని పాండ్రంగి కురవల్లి వద్ద ఉన్న గోస్తనీనది వద్దకు వెళ్లాడు. నది దగ్గర చెక్ డ్యాం మీదకు వెళ్లి ముగ్గురు స్నేహితులతో కలిసి ఫొటోలు తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు ముగ్గురూ నదిలో పడిపోయారు. వారిలో హరి గల్లంతయ్యాడు. మిగిలిన ఇద్దరు స్నేహితులు ఒడ్డుకు చేరుకుని హరి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈతగాళ్లు గాలించినా అచూకీ దొరకలేదు. సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు గాలింపు చేపట్టగా నదిలో మృతదేహం తేలింది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రామతీర్థానికి పోటెత్తిన భక్తులు


శ్రీ సీతారామస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. కార్తీకమాసంలో ఆఖరి సోమవారం కావడంతో రామాలయంతో పాటు శివాలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఈ సందర్భంగా అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉమా సదాశివాలయంలో శివుడికి పంచామృత ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపించారు. సారిపల్లి, పారసాం, ఒమ్మి, సతివాడ, బూరాడపేట గ్రామాల్లో ఉన్న పురాతన శివాలయాలకు వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి స్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో దీపారాధన చేశారు.

15న జాబ్‌మేళా


జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ గోవిందరావు

పార్వతీపురం: నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 15న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేళాకు 16 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని, పదోతరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బిటెక్, ఎంఎస్‌సీ చదివిన అభ్యర్థులు వారి వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947,6303493720 నంబర్లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, జిల్లా పరిశ్రమల అధికారి కరుణాకర్, జిల్లా స్కిల్‌డెవలప్‌మెంట్ అధికారి యు. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు పయనం


అథ్లెటిక్స్ పోటీలకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సోమవారం పయనమైంది. ఈనెల 12 నుంచి 3 రోజుల పాటు గుంటూరు జిల్లా నరసారావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరగనున్న పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ మేరకు క్రీడాకారులకు అండర్–19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీపీఎల్ఎన్ కృష్ణ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పీడీలు, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు సత్తా

- ద్వితీయ స్థానంలో నిలిచిన క్రీడాకారులు



రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన బాల్ బ్యాడ్మింటన్ జిల్లా పురుషుల జట్టు

తెర్లాం: రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన పురుషుల జట్టు సత్తా చాటింది. రాష్ట్రస్థాయి పోటీలు ఈ నెల 8 నుంచి 10వరకు అనంతపురంలో జరగ్గా జిల్లా పురుషుల జట్టు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. జిల్లా పురుషుల జట్టు రాష్ట్రస్థాయిలో రాణించడంతో బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులతోపాటు, పలువురు పీడీలు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు. మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా పురుషుల జట్టుకు కోచ్‌లుగా జి.సింహాచలం, టి.శ్రీనివాసరావు వ్యవహించారు.

జాతీయ స్థాయి పోటీలకు ముగ్గురి ఎంపిక

జనవరి 2024లో జరగనున్న జాతీయ స్థాయి సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని బాల్ బ్యాడ్మింటన్ కోచ్, నెమలాం హైస్కూల్ పీడీ జి.సింహాచలం సోమవారం తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బాల్ బ్యాడ్మింటన్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, పీడీలు అభినందించారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు మన్యం విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

పార్వతీపురంటౌన్: జాతీయస్థాయి కరాటే పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లా విద్యార్థి ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన తన కార్యాలయం వద్ద ఆ విద్యార్థిని అభినందించారు. పార్వతీపురం మండలం పెదమరికి ఎంపీయూపీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న హిమరికనాని కరాటే పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపించాడని ఢిల్లీలో జరగనున్న పోటీలకు అర్హత సాధించినట్లు డీఈఓ చెప్పారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్.వెంకటేశ్వరరావు, కోచ్ ఎస్. నాగేశ్వరరావు, చీఫ్ కోచ్ బి.గోపాల్, జిల్లా స్కూల్‌గేమ్స్ సెక్రటరీ గాంధీ, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సిపురం ఆలయంలో హుండీ చోరీ

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం రైల్వే స్టేషన్ సమీపంలో గల కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండలు హుండీ పగల గొట్టి చోరీకి పాల్పడ్డారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకుడు తలుపులు తెరచి చూసేసరికి హుండీ తాళం పగుల గొట్టి ఉండడం గమనించి కమిటీ సభ్యులకు తెలిపారు. తక్షణమే వారు పోలీసు సిబ్బందికి సమాచారాన్ని అందజేయడంతో పోలీసులు ఆలయానికి వచ్చి దర్యాప్తు చేశారు. ఆలయ ప్రాంగణంలో సీసీ కెమెరాలను పరిశీలించి దుండగులను పట్టుకుంటామని రూరల్ ఎస్సై దినకర్ తెలిపారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

- అండర్–14, 17, 19 విభాగాల్లో 960 మంది క్రీడాకారులు హాజరు
- పోటీలను ప్రారంభించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: విజయనగరం జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడామైదానంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి సోమవారం ప్రారంభించారు. రాష్ట్ర స్థాయిలో అండర్–14, 17, 19 విభాగాల్లో జరుగుతున్న స్కూల్ గేమ్స్ పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 960 మంది బాల, బాలికలు హాజరయ్యారు. నాకౌట్ పద్ధతిలో నిర్వహించే పోటీల్లో మొదటి రోజు అండర్–14, 17 విభాగాల క్రీడాకారులు తలపడ్డారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపికచేస్తామని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ తెలిపారు. పోటీలు మంగళ, బుధవారాలు జరుగుతాయని పేర్కొన్నారు.


రింగ్‌లో తలపడుతున్న క్రీడాకారులు


బాక్సింగ్ పోటీలకు హాజరైన వివిధ జిల్లాల విద్యార్థులు

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు: కోలగట్ల

క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని, ప్రభుత్వం వివిధి ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. బాక్సింగ్ పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తోందని, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. బాక్సింగ్ అంటే తనకు ఎంతో మక్కువని చెప్పారు. తన 20వ ఏట బాక్సింగ్‌లో తర్ఫీదు పొంది 1980లో స్వర్ణంగా బాక్సింగ్ పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.